సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

- లక్ష మందితో బహిరంగ సభ
- కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: బనగానపల్లె పట్టణానికి ఈనెల 4న రానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు రైతు విశ్రాంతి భవనంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు- నేడు కార్యక్రమం కింద రూ. 22 కోట్లతో బనగానపల్లెలో అన్ని హంగులతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని సీఎం ప్రారంభిస్తారన్నారు. అనంతరం స్థానిక క్రీడామైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలతో సుమారు లక్ష మంది బహిరంగ సమావేశానికి హాజరవుతారన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పార్టీశ్రేణులు సోమవారం ఉదయం 9 గంటలకు బనగానపల్లె చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, భీమునిపాడు అనిల్‌కుమార్‌రెడ్డి, గోదుల ఓబులరెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, ఈర్నపాటి సుబ్బరాయుడు, గుంజలపాడు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగర్జునరెడ్డి, కరుణాకర్, డీవీ శేషిరెడ్డి, ఏర్వ వెంకటశేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 4న బనగానపల్లెకు రానున్న నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రం సంజామల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల, వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సీఎం పర్యటనపై ఎమ్మెల్యే చర్చించారు. ఈబీసీ నేస్తం పథకం నిధులతో పాటు బనగానపల్లెలో రూ.22 కోట్లతో నూతనంగా నిర్మించిన వంద పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాలను సీఎం ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ జరగని విధంగా సీఎం సభను విజయవంతం చేయాని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండ సూర్య ప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీలు చిన్న బాబు, కాచన రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట రామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీ సభ్యులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మనందరికి కొండంత అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె పర్యటనకు వస్తున్నందున సమిష్టిగా విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పల్లెలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభోత్సవం అనంతరం 45-60 ఏళ్ల లోపు అగ్రవర్ణాలకు చెందిన మహిళలకు ఈబీసీ నేస్తం పథకం కింద రూ.15వేలను బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారన్నారు. సీఎం బహిరంగ సభను విజయవంతం చేసి బనగానపల్లె నియోజవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని నిరూపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సభ తర్వాత ప్రతిపక్షాలు ప్రచారం చేసుకోవాలంటే భయం పట్టుకోవాలన్నారు. గతంలో ఎప్పుడూ లేని రీతిలో బనగానపల్లె నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కుల,మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని, ప్రతి ఇంటి నుంచి ఒకరు వచ్చేలా కార్యాచరణ రూపొందించుకుని బహిరంగ సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లె నుంచి తరలిరావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

అవుకు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె పర్యటనను ఐకమత్యంగా విజయవంతం చేద్దామని, ప్రతి పల్లె నుంచి జనం తరలివచ్చేలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో శుక్రవారం ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తదితర నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. సీఎం పర్యటనపై వారితో ఎమ్మెల్యే చర్చించారు. కాటసాని, చల్లా కుటుంబాలు ఒకటేనని, రాబోయే ఎన్నికల్లో మెజారిటీతో విజయం సాధిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేతోపాటు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ బనగానపల్లెలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని ఈ నెల 4వ తేదీన సీఎం ప్రారంభిస్తారని, అదేవిధంగా ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు బటన్ నొక్కి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసామన్నారు. సీఎం బహిరంగ సభకు మండలంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చేలా నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద మునిరెడ్డి, గోపవరం గోపాల్ రెడ్డి, అయ్యపురెడ్డి, పేరం వెంకటసుబ్బారెడ్డి, పార్థు, రామిరెడ్డి, ముక్కమళ్ల పుల్లారెడ్డి, సాయినాథ్ రెడ్డి, చెన్నప్ప, సురేష్, తిమ్మయ్య, ఈశ్వర్ రెడ్డి, తల్లం సుబ్రహ్మణ్యం, పురుషోత్తం నాయుడు, లక్మానాయక్, రాముడు నాయక్, కంబగిరి రాముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి బుగ్గన పర్యటన



డోన్ : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో శనివారం నుంచి మూడురోజుల పాటు పర్యటించనున్నారని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంత్రి బుగ్గన స్వగృహంలో వారు మాట్లాడుతూ స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం జగనన్న కాలనీల్లో ఉండే లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను మంత్రి అందజేస్తారన్నారు. సాయంత్రం మండలంలోని తాటిమానుకోత్తూరు నుండి 44వ జాతీయ రహదారి వరకు నిర్మించిన పీఆర్ రోడ్డు, చిన్న మల్కాపురం నుంచి వలిసెల గ్రానమం వరకు వేసిన రోడ్లను మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఆదివారం ఉదయం బేతంచెర్ల నుంచి రామళ్లకోట వరకు, కొలుములపల్లె నుంచి ముద్దారం వరకు వేసిన పీఆర్ రోడ్లను ప్రారంభిస్తారన్నారు. అనంతరం వీరాయపల్లె రోడ్డు, రామళ్లకోట - మెలమీద పెండేకల్ రోడ్డు, పెండేకల్ - మద్రికుంట రోడ్డు, గూటుపల్లె రహదారి ప్రారంభిస్తరన్నారు. తదనంతరం పాలుట్ల రంగస్వామి దేవాలయం వరకు నిర్మించిన పీఆర్ రోడ్డు, పాలుట్ల ఆంజనేయ స్వామి జీర్ణోద్ధరణ పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం బేతంచెర్ల మండలం ముచ్చట్ల మల్లికార్జునస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ పనులు, కేకే కొట్టాల గ్రామం నుంచి బిల్లల స్వర్గ గుహల వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారన్నారు. 4వ తేదీ సోమవారం బేతంచెర్ల మండల కేంద్రంలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన అనంతరం బనగానపల్లె పట్టణంలో జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభలో మంత్రి పాల్గొంటారని వారి వివరించారు. ఆయా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పిస్తాం

డోన్ : పట్టణంలోని 17వ వార్డు నందు గల త్రివర్ణకాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. కౌన్సిలర్ నాగేంద్రమూర్తితో కలిసి కమిషనర్ శివారు ప్రాంతమైన త్రివర్ణ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో కమిషనర్ మాట్లాడారు. మంచినీరు, మురుగు కాల్వలు, సీసీ రోడ్లను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేయింటర్ మాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్ అందజేస్తున్న హెచ్‌ఎం పద్మావతి

డోన్ టౌన్ : పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి 184 మంది విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం పద్మావతి, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి అందజేశారు. ప్రభుత్వం అందించిన బై జ్యూస్ కంటెంట్‌కు సంబంధించిన ట్యాబ్‌లను తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు వారు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, లక్ష్మయ్య, లక్ష్మీకాంతరెడ్డి, ఆదినారాయణ, దేవేంద్రప్ప, లీలావతమ్మ, అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు


ఆర్.లింగందిన్నె గ్రామంలో ప్రజలతో సమావేశమైన డీఎస్పీ షర్ఫుద్దీన్

సంజామల: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని, ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించమని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆల్వకొండ, కానాల, ఆర్.లింగందిన్నె గ్రామాలలో శుక్రవారం ఎస్‌ఐ రమేష్ రెడ్డితో కలసి డీఎస్పీ పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలతో డీఎస్పీ సమావేశమై ప్రసంగించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఓటర్లకు ఏ మాత్రం ఆటకం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఫంక్షన్ హాల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న 11 కేవీ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో శ్రీనివాసనగర్, ఫంక్షన్‌హాల్ సమీప ప్రాంతాల కాలనీల్లో కరెంటు ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ ప్రితం రెడ్డి

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని సీఐ ప్రితం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి సమస్యాత్మక గ్రామమైన కొలుములపల్లెలో ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సీఐ రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సీఐ సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏ మాత్రం గొడవలకు పాల్పడినా, సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు తిరుపాల్ నాయక్, చంద్రశేఖరప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసానికి షియా మతస్తుల వినతి

బనగానపల్లె రూరల్ : షియా మతానికి చెందిన సయ్యద్, పఠాటన్ తెగలను బీసీ-ఈ కేటగిరిలో చేర్చే అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ నియోజకవర్గంలోని షియా మతస్తులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో షియా మతస్తులు తమ సమస్యలను కాటసానికి విన్నవించారు. వైఎస్సార్ చేయూత, ఉపకారవేతనాలు, బీసీ-ఈ సర్టిఫికెట్ అందడంలేదన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌అలిఅబ్బాస్, సయ్యద్‌ముర్తుజా, సజ్జాద్, సాబ్జాస్, కొండపేట అబ్బాస్, లిఖాయాత్ పాల్గొన్నారు.

సారా బట్టీల ధ్వంసం

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామ సమీపంలోని కొండల్లో నాటుసారా తయారీ బట్టీలపై బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ బట్టీలను ధ్వంసం చేసి 60 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. అలాగే 1600 లీటర్ల బెల్లం ఊటను పారబోసారు. గ్రామానికి చెందిన కోనేటి కేశాలు సుంకన్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. మరో నిందితుడు బోయకంబగిరి స్వామి పరారయ్యాడని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

ఏళ్ల నాటి తాగునీటి సమస్యకు పరిష్కారం


తాగునీటి పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న చైర్మన్

బేతంచెర్ల: పట్టణ ప్రజలకు ఈనెల 4వ తేదీన వాటర్ గ్రిడ్ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే కృష్ణా జాలలను పట్టణ ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో పైపులైన్లు, పంప్ హౌస్‌లను పరిశుభ్రం చేయడమే కాకుండా, రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు పనులను శుక్రవారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక కృషితో ఎళ్లనాటి తాగునీటి సమస్య పరిష్కారం కానుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వలీబాషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ గోపాల్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సర పరీక్షకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 201 మంది విద్యార్థులు హాజ రు కావాల్సి ఉండగా 15 మంది, పట్టణ శివారులోని గురుకుల కళాశాలలో 145 మంది విద్యార్థులకుగాను ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపర్‌వైజర్లుగా ప్రిన్సిపాల్స్ మద్దిలేటి స్వామి, సౌభాగ్యలక్ష్మి డిపార్ట్‌మెంటల్ అధికారులుగా గోస్పాడు, కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు జక్కరయ్య, శ్రీదేవి వ్యవహరించారు.

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 624 మంది విద్యార్థులకుగాను 25 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు షాలిహాబేగం, తిరుపతయ్య, చంద్రహాస్‌రెడ్డి తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

బేతంచెర్ల: పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల, రీడ్ జూనియర్ కళాశాలలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలను సిట్టింగ్ స్క్వాడ్ చౌడప్ప శుక్రవారం తనిఖీ చేశారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

కొలిమిగుండ్ల: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కొలిమిగుండ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోడల్ స్కూల్, కస్తూర్బా కు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 119 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరు అయినట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండ్ శ్రీనివాసులు తెలిపారు.

పల్స్ పోలియోను జయప్రదం చేయండి

ప్యాపిలి: మార్చి 3,4,5 తేదీల్లో చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ఆశా వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని వారు తెలిపారు.

కొలిమిగుండ్ల: ఈనెల 3వ తేదిన ప్రారంభం కానున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని తల్లితండ్రులకు సూచించారు. 4,5 తేదీల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేస్తారన్నారు. మండల వ్యాప్తంగా 3131 మంది చిన్నారులను గుర్తించామన్నారు. 30 బూత్‌లు ఏర్పాటుతో పాటు కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్, బెలుం గుహల వద్ద ప్రత్యేకంగా బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శుభకార్యం

డోన్ రూరల్ : మండల పరిధిలోని వెంకటనాయునిపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు రాంకుమార్‌యాదవ్ తమ్ముని వివాహ వేడుకకు మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు ఆర్జున్‌రెడ్డి వధూవరులు బాలకృష్ణ యా దవ్, మహేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీసీ రాజ్‌కుమార్ యాదవ్, సింగిల్ విండో సొసైటీ బ్యాంక్ చైర్మన్ తిరుమలరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, నాయకులు జానకిరాం, రవి, తిరుపాలు తదితరులు శుభకార్యానికి హాజరయ్యారు.

ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ టౌన్ : ఆధునిక సాంకేతిక పరి జ్ఞానంతో బ్యాంక్ ఖాతాలో ఉన్న బ్యాలెన్స్‌ను హ్యాకర్లు కొల్లగొట్టకుండ ఉండాలంటే అప్రమత్తత అవసరం అని డీసీసీ బ్యాంక్ సీజీఎం లక్ష్మినారాయణ అన్నారు. పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్లో శుక్రవారం పొదుపు మహిళలకు,బ్యాంకర్లకు త్వరలో అందుబాటులోకి రానున్న ఆర్థిక అక్షరాస్త కేంద్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు ఎస్‌బీఐ మేనేజర్ చంద్ర, కేడీసీసీ బ్యాంక్ అధికారి హనుమంతరెడ్డి ఆర్థిక నేరాలు, అప్రమత్తత, సైబర్ నేరాలు, డిజిటల్ లావా దేవీలు, రిజర్వ్ బ్యాంక్ ఖాతాదారులకు కలిగ్తున్న ప్రయోజనాలను వివరించారు.

పామాయిల్ తోటల సాగు లాభదాయకం


పామాయిల్ మొక్కలను నాటుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

బేతంచెర్ల: పామాయిల్ తోటల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలోని రైతు బుగ్గన పార్థసారధి రెడ్డి 8ఎకరాలలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ భాగస్వామ్యంలో అయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయిల్ పామ్ సాగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జాతీయ నూనె గింజలు, ఆయిల్ పామ్ మిషన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, ఉద్యానశాఖ అధికారి రఘువరన్, పతంజలి ఫుడ్స్ జిల్లా మేనేజర్ మహదేవయ్య పాల్గొన్నారు.

పండగలా సాగిన పింఛన్ పంపిణీ


పింఛన్ అందిస్తున్న సర్పంచ్ ఉల్పాల మద్దిలేటి


పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సుగుణ


లక్ష్మీదేవి వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ లలిత

డోన్ రూరల్ : వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీ శుక్రవారం పండుగలా సాగింది. వలంటీర్లు తెల్లవారుజాము నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందజేశారు. జీతంలా పింఛన్ అందడంతో అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతు తదితర లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో 60శాతం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ జరిగింది. ఆవులదొడ్డిలో సర్పంచ్ ఉల్పాల మద్దిలేటి ఆధ్వర్యంలో వలంటీర్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

కోవెలకుంట్ల: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో మార్చి నెల పింఛన్లు శుక్రవారం ఠంచన్‌గా అందాయి. 17 గ్రామ సచివాలయాలకు సంబంధించి 6,104 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, డప్పు, చర్మకళాకారుల పింఛన్లు ఉన్నాయి. ఆయా గ్రామాల వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. మొదటి రోజే 5,601 మందికి అందజేసి 91శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో 11 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు శుక్రవారం వలంటీర్లు మార్చి నెల పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సంబంధించి 5,337 మంది లబ్ధిదారుల ఉండగా మొదటి రోజు 3,217మందికి వలంటీర్లు పింఛన్ అందజేశారు. పింఛన్ల పంపిణీ 60.28 శాతం పూర్తి చేశారని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు.

బనగానపల్లె : మండలంలో ఒకటవ తేదీ శుక్రవారం పింఛన్ పంపిణీ ఠంచన్‌గా సాగింది. వలంటీర్లు ఉదయమే లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. పలుకూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇటీవల ప్రమాదానికి గురై బేతంచర్ల మండలంలోని బుగ్గానపల్లెలో పుట్టింటిలో విశ్రాంతి తీసుకుంటుంది. వలంటీర్ లలిత బుగ్గానపల్లెకు వెళ్లి లక్ష్మీదేవికి పింఛన్ సొమ్ము అందజేశారు.

7న మండల సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే మండల మీట్‌కు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం, విద్యుత్, గ్రామీణ గృహ నిర్మాణం, ప్రజారోగ్యం, మాతా శిశుసంక్షేమ, వైఎస్సార్ క్రాంతిపథం, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఉపాధిహామీ తదితర శాఖల పనితీరుపై చర్చ జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

బనగానపల్లె రూరల్ : బాలికలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి అధ్యక్షతన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాలిక సంరక్షణకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణ, లింగవివక్ష, బాలికల చట్టాలపై సూపర్‌వైజర్లు శైలజ, చిట్టెమ్మ, సాలమ్మ విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నిందితులకు రిమాండ్

డోన్ టౌన్ : రెండు రోజుల క్రితం పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన దేవరాజు ఇంట్లో చోరికి పాల్పడిన వ్యక్తులను కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 29న తెల్లవారుజామున ఈశ్వర్ అలియాస్ గాలిగాడు, ఇతని శిష్యుడు ప్రభాస్..... దేవరాజు ఇంటిలోకి చొరబడి విలువైన రెండు ల్యాప్‌ట్యాబ్‌లు, నాలుగు సెల్ ఫోన్లను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు సీసీ పుటేజ్‌లు పరిశీలించి నిందితులను గుర్తించారు. వారి నుంచి ల్యాబ్ ట్యాప్‌లు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

బూత్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలి


మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి రావాలంటే బూత్ కమిటీలు క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా పని చేయాలని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎన్‌రాచర్ల గ్రామంలో శుక్రవారం 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో ఏర్పాటైన బూత్ కమిటీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాష తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ.. చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి


ఆస్థానంలో ప్రమాణం చేస్తున్న అత్తార్‌జాహెద్

బనగానపల్లె రూరల్ : టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి తన అన్న బీసీ బాలతిమ్మరెడ్డి మృతికి తాను కారణం కాదని దేవుడి పై ప్రమాణం చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్‌జాహెద్ సూచించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టీడీపీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి.... అత్తార్ జాహెద్ తన అన్న మృతికి కారకుడని ఆరోపించారు. అయితే తాను గతంలో మాజీ టీడీపీ ఎమ్మెల్యే తన అన్న మృతికి కారకుడన్నందునే తనపై అసత్యారోపణలు చేశారని అత్తార్‌జాహెద్ ఖండించారు. అయినా తాను ఆ మాటకే కట్టుబడి ఉన్నానని, మార్చి 1న సాయంత్రం 4 గంటలకు ఇరువురం ఆస్థానం వద్ద ప్రమాణం చేసేందుకు రావాలంటూ రెండురోజుల కిందట అత్తార్‌జాహెద్ సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సత్తార్‌జాహెద్‌తో పాటు ముస్లిం సోదరులు, పలువురు మతపెద్దలతో కలిసి సుమారు అరగంట పాటు మాజీ ఎమ్మెల్యే బీసీ కోసం ఆస్థానం వద్ద వేచి చూశారు. ఆయన రాకపోవడంతో అత్తార్‌జాహెద్ ఆస్థానం వద్ద తన అన్న మృతికి తాను ఏ మాత్రం కారణం కాదంటూ ప్రమాణం చేశారు. తనలానే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కూడా తన అన్న మృతికి తాను కారణం కాదని తన ఇష్టదైవంపై బహిరంగంగా ప్రమాణం చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మరోమారు సవాల్ విసిరారు. కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, యునూస్, అనిల్ హుస్సేన్, పెద్దన్న, పాన్‌బీడ వలి, లారీ కరీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలిశ్రీనివాసులు, సురేష్, కిశోర్, ప్రసాద్, కృష్ణ, సుబ్బారాయుడు, సుదర్శన్ రెడ్డి, మౌలి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రెండవ గ్రామసచివాలయ పరిధిలో రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాలకు చెందిన డాక్టర్లు సుప్రియ, హరికృష్ణ, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు రాబర్ట్‌కెన్నెడీ, అశోక్, కంటి వైద్య నిపుణులు గంగాధర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ గోపినాథ్, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.